సాక్షి
చిత్తూరు
శనివారం । 25 । ఫిబ్రవరి । 2023



చిత్తూరు బులియన్

బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.54,000
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.5,100
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.68,000
రిటైల్ వెండి గ్రాము రూ.69.00

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	36	17
తిరుపతి	36	18
తిరుమల	31	14
గూడూరు	35	19
నగరి	36	17



తిరుచ్చిపై సిరులతల్లి

తిరుచానూరు(చంద్రగిరి): వారపు ఉత్సవాల్లో భాగంగా తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.

న్యూస్‌రీల్

నిబంధనల మేరకే స్కానింగ్

చిత్తూరు రూరల్: నిబంధనల మేరకే గర్భిణులకు స్కానింగ్ చేయాలని డీఎంహెచ్‌ఓ జి.ప్రకాశం ఆదేశించారు. శుక్రవారం చిత్తూరు జిల్లా ఆస్పత్రిలోని స్కానింగ్ విభాగాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధి విధానాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఆయన వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్ ఉన్నారు.

పేద రైతులు, గిరిజనులకు కోడెగిత్తలు, దూడలు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి గోశాలలోని కోడెగిత్తలు, కోడె దూడలను పేద రైతులు, గిరిజనులకు వితరణగా అందించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆలయ గోశాలలోని 18 జతల కోడెగిత్తలు, దూడలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. అర్హులైన వారు మార్చి 15వ తేదీలోపు ఆయా గ్రామ సర్పంచ్, వీఆర్‌ఓ వద్ద ధ్రువీకరణ పత్రం తీసుకుని ఆలయాధికారులకు అందజేయాలని సూచించారు. వీటిని తీసుకున్నవారు పెంచుకోవాలే కానీ, విక్రయించకూడదని స్పష్టం చేశారు.

ఎన్నికల 'స్వీప్'పై అవగాహన

చిత్తూరు కలెక్టరేట్ : ఎమ్మెల్సీ ఎన్నికల స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్)పై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల కసరత్తులో భాగంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయడం ఎలా, తదితర అంశాలపై ఓటర్లకు అవగాహన కల్పించినట్లు వెల్లడించారు.

పడిలేస్తున్న టమాటా



పలమనేరు మార్కెట్‌లో టమాట

పలమనేరు : టమాట ధరలు పడిలేస్తూ ఉండడంతో రైతులు ఆశనిరాశల నడుమ కొట్టుమిట్టాడుతున్నారు. ఈ నెల తొలి వారంలో 14 కిలోల బాక్సు టమాట ధర రూ.350 ఉండగా, రెండో వారానికి రూ.400కి చేరింది. ప్రస్తుతం బాక్సు ధర రూ.320 పలుకుతోంది. అయితే వేసవి వస్తున్నందున రేట్లు మరింత పెరిగే అవకాశముందని వ్యాపారులు తెలియజేస్తున్నారు.

27, 28 తేదీల్లో పారిశ్రామిక ఎగ్జిబిషన్

తిరుపతి అర్బన్: తిరుపతి–కరకంబాడి రోడ్డులోని ఓ ప్రయివేటు హోటల్‌లో ఈ నెల 27, 28 తేదీల్లో పారిశ్రామిక ఎగ్జిబిషన్, వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలను నిర్వహించనున్నట్టు భారత ప్రభుత్వ ఎంఎస్‌ఎంఈ మంత్రిత్వ శాఖ, విశాఖపట్నం సహాయ సంచాలకులు జీవీఆర్ నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా సూక్ష్మ, చిన్న, మధ్య, పెద్ద పరిశ్రమల వారు హాజరై ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచడంతోపాటు బయ్యర్ అండ్ సెల్లర్స్ మీట్, ముఖాముఖి కార్యక్రమాల్లో పాల్గొననున్నట్టు ఆయన వెల్లడించారు.

ఆర్టీసీ టెండర్లు

తిరుపతి అర్బన్: జిల్లాలోని ఆర్టీసీ బస్టాండ్లలో ఖాళీగా ఉన్న 88 దుకాణాలను భర్తీ చేయడానికి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి శుక్రవారం పేర్కొన్నారు. శుక్రవారం నుంచి మార్చి 10వ తేదీ వరకు ఆయా ఆర్టీసీ డిపోల్లో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. మార్చి 10వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఇంటిగంట వరకు తిరుపతి జిల్లా ప్రజా రవాణాధికారి కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బాక్స్‌లో టెండర్ దరఖాస్తులు వేయాలని, అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు టెండర్లు ఓపెన్ చేస్తామని తెలిపారు.

ముగిసిన జాతీయ సదస్సు

తిరుపతి ఎడ్యుకేషన్: పద్మావతి మహిళా వర్సిటీలో రెండు రోజులుగా భారతదేశంలో పరువు హత్యలు–సామాజిక మానసిక కారణాలు అన్న అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సు శుక్రవారంతో ముగిసింది. ముగింపు సమావేశంలో ప్రొఫెసర్ బ్యులాశేఖర్ మాట్లాడారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన లో లింగ వివక్షత, హానర్ కిల్లింగ్ వంటి అనాగరిక దురాచారాలు అడ్డంకులుగా నిలిచాయని తెలిపారు. పితృస్వామ్య భావజాల మూలాలను సమగ్రమైన కార్యాచరణతో నిర్మూలించవచ్చన్నారు. మహిళా అధ్యయన కేంద్రం ఇన్‌చార్జ్ హెడ్ నీరజ మాట్లాడుతూ పరువు హత్య మానవ హక్కుల ఉల్లంఘనేనన్నారు. ప్రొఫెసర్ శారద, మాధురి పరదశి, ప్రొఫెసర్ అముదవల్లి, ప్రొఫెసర్ సాయిసుజాత, ప్రొఫెసర్ నిర్మల, స్టూడెంట్ అఫైర్స్ డీన్ శారద పాల్గొన్నారు.

మేం రాం!



లోకేష్ యువగళం పాదయాత్రను హైలెట్ చేసేందుకు టీడీపీ నేతలు పడరాని పాట్లు పడుతున్నారు. చినబాబు ఆధ్వర్యంలో ఇతర పార్టీ నేతలను చేర్పించేందుకు నానాతంటాలు పడుతున్నారు. ఇందులో ముఖ్యంగా గ్రామస్థాయిలో చురుగ్గా పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్లకు వెళ్లి మధ్యస్తాలు పెడుతున్నారు. తమ పార్టీలో చేరాలంటూ కాళ్లబేరానికి దిగుతున్నారు. లోకేష్ ఆధ్వర్యంలో పార్టీ కొండువా కప్పుకోవాలని బతిమలాడుతున్నారు. ఆయన పాదయాత్రగా వచ్చేటప్పుడు పూల దండ వేసి స్వాగతం పలకాలని కాళ్లావేళ్లాపడుతున్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే మీరేం కోరుకున్నా చేస్తామంటూ బంపర్ ఆఫర్లు ఇస్తున్నారు. కానీ జగన్ సైన్యం ససేమిర అంటున్నారు. 'మీకో దండం.. మేం రాం' అంటూ ముఖాన్నే చెప్పేస్తున్నారు. దీంతో చేసేది లేక టీడీపీ నేతలు బిక్కముఖాలేస్తున్నారు.

ఇదిగో సాక్ష్యం

- కుప్పం నుంచి ప్రారంభమైన యువగళం పాదయాత్ర జీడీనెల్లూరు నియోజకవర్గం మీదుగా సాగింది. మార్గమధ్యలోని శ్రీరంగరాజపురం మండలంలో పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు టీడీపీలో చేరేలా ఆ పార్టీ నేతలు ప్రణాళిక రచించారు. అందులో భాగంగా కృష్ణమూర్తి(పేరుమార్చాం) నాయకుడి ఇంటికెళ్లి టీడీపీలో చేరాలని బతిమలాడారు. లోకేష్ ఆధ్వర్యంలో పార్టీ కండువా కప్పుకోవాలని కాళ్లావేళ్లాపడ్డారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే పదవులు ఇస్తామని నమ్మబలికారు. చిన్నాచితక కాంట్రాక్టర్ పనులూ చేసుకోవచ్చని చెప్పుకొచ్చారు. కానీ ఆయన 'మాకొద్దు బాబు' అంటూ వారి ముఖాన్నే చెప్పడంతో ఖంగుతిన్నారు. చేసేది లేక ఉసూరుమంటూ వెనుదిరిగారు.
- మూడు రోజుల క్రితం శ్రీకాళహస్తి నియోజకవర్గం, పాపానాయుడుపేట మండలంలో లోకేష్ పాదయాత్ర సాగింది. స్థానికంగా చురుగ్గా ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకుడు (బుచ్చిరెడ్డి) పేరుమార్చాం ఇంటికి దబ్బు, పార్టీ కండువాలతో టీడీపీ నాయకులు వెళ్లారు. లోకేష్ ఆధ్వర్యంలో పార్టీలో చేరాలని బేరాలకు దిగారు. మీరుచెబితే గ్రామస్తులు కూడా చాలామంది చేరుతారని, టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మీకు ఏం కావాలన్నా చేస్తామంటూ ఆఫర్లు కురిపించారు. కానీ ఆయన 'మేం రాం' అంటూ తెగేసి చెప్పడంతో అక్కడి నుంచి ఉడాయించారు.

.. జిల్లాలో ఇవి మచ్చుకు రెండు మాత్రమే. లోకేష్ పాదయాత్రలో ఇలాంటివి నిత్యకృత్యం. వైఎస్సార్‌సీపీ నేతలే టార్గట్‌గా టీడీపీనేతలు బేరాలకు దిగుతున్నారు. ఆఫర్లమీద ఆఫర్లు ఇస్తూ పార్టీలో చేరాలని గడ్డాలు పట్టుకుని మరీ బతిమలాడుతున్నా.. జగన్ సైన్యం అందుకు ససేమిర అనడం చర్చనీయాంశమవుతోంది.

- టీడీపీలో చేరాలంటూ ఆ పార్టీ నేతల బేరసారాలు
- లోకేష్ ఆధ్వర్యంలో కండువాలు కప్పుకోవాలంటూ కాళ్లబేరాలు
- అధికారంలోకి వస్తే ఏం కావాలన్నా చేస్తామంటూ బంపర్ ఆఫర్లు
- గ్రామస్థాయి లీడర్ల ఇళ్లకు వెళ్లి మధ్యస్తాలు
- ససేమిర అంటున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

సాక్షి, తిరుపతి: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో టీడీపీ నేత లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు స్పందన లేకపోవడంతో ఆ పార్టీ నేతలు రకరకాల ఎత్తులు, కుట్రలు, కుతంత్రాలు పన్నుతున్నారు. ఇటీవల శ్రీకాళహస్తి నియోజకవర్గం, తొట్టంబేడు మండలంలో ఓ టీడీపీ కార్యకర్తకు చెందిన ఆరు ఎకరాల వేరుశనగ పంటను దున్నేసి దాన్ని వైఎస్సార్‌సీపీపై నెట్టాలని ప్రయత్నించారు. ఆ పంటను చినబాబు పరిశీలించి వైఎస్సార్‌సీపీపై చిందులేసే విధంగా స్కెచ్చేశారు. కానీ అది బెడిసికొట్టడంతో ఇప్పుడు కొత్త నాటకాలకు తెరలేపుతున్నారు. క్షేత్ర స్థాయిలో బలంగా ఉన్న వైఎస్సార్‌సీపీ నేతలే టార్గెట్‌గా ఎం

ప్రత్యేక నిఘా

గ్రామస్థాయిలో ముఖ్యమైన వైఎస్సార్‌సీపీ నేతలను కలిసేందుకు టీడీపీ ఓ బృందాన్ని రెడీ చేసింది. ఆ బృందంలోని సభ్యులు యువగళం పాదయాత్ర సాగే ముందురోజు ఆయా గ్రామాల్లోని నేతల ఇళ్లకు వెళ్లడం.. వారిని పార్టీలోకి రావాలని బతిమలాడుతూ బేరసారాలు కుదర్చడమే పనిగా పెట్టుకున్నట్టు తెలుస్తోంది. గ్రామంలో ద్వితీయ, తృతీయ స్థాయి నాయకులైతే ఆయా మండలాల నాయకులే వెళ్లి కలుస్తున్నట్టు సమాచారం. మరో వైపు శ్రీకాళహస్తిలో తనయుడు బొజ్జల సుధీర్‌రెడ్డితోపాటు తల్లి బొజ్జల బృందమ్మ సైతం నియోజకవర్గంలో ముఖ్యనాయకుల నివాసాలకు వెళ్లి రహస్య మంతనాలు జరిపినట్టు తెలుస్తోంది.

చుకుంటున్నారు. వారిని ఎలాగైనా లోకేష్ ఆధ్వర్యంలో పార్టీలో చేరేవిధంగా రకరకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే శ్రీకాళహస్తి నుంచి ప్రారంభమైన యువగళం పాదయాత్రకు ముందు రోజు టీడీపీ నేతలు బొజ్జల సుధీర్‌రెడ్డి, మండల స్థాయి నాయకులు కొందరు గతంలో ఆ పార్టీ కోసం పనిచేసిన వారి నివాసాలుకు వెళ్లారు. అలాగే వైఎస్సార్‌సీపీ నేతలను విడివిడిగా కలిసి టీడీపీలోకి ఆహ్వానించగా.. వారు ససేమిర అనడంతో చేసేదిలేక అక్కడి నుంచి వెనుదిరిగినట్టు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

తిరుపతిలో అద్దె మనుషులకు పార్టీ కండువాలు?

తిరుపతి అసెంబ్లీ పరిధిలో యువగళం పాదయాత్ర సాగుతుండడంతో స్థానిక టీడీపీ శ్రేణులు వార్డుల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. 'పార్టీలో చేరండి, లేదంటే పాదయాత్రలో పాల్గొనండి' అంటూ ప్రాధేయపడుతున్నారు. ఎవ్వరూ సుముఖంగా లేకపోవడంతో కొందరు అద్దె మనుషులను పిలిపించి వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించేలా ఏర్పాట్లు చేసినట్టు సమాచారం.

అసత్య కథనాలపై ఆగ్రహం



సదుంలో ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న పెద్దిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

సదుం : ఈనాడు దినపత్రిక పాఠకుల విశ్వసనీయత కోల్పోయిందని, విలువలను పూర్తిగా వదిలేసిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి మండిపడ్డారు. ప్రభుత్వంపై తప్పుడు కథనాల ప్రచురించినందుకు నిరసనగా శుక్రవారం సదుంలో ఈనాడు ప్రతులను దహనం చేశారు. చంద్రబాబును సీఎం చేయడమే లక్ష్యంగా ఎల్లో మీడియా పని చేయడం దారుణమన్నారు. ఈనాడు, ఏబీఎన్, టీవీ5లను ప్రజలు నమ్మడం మానేశారని చెప్పారు. ఇప్పటికైనా వాస్తవాలను ప్రచురించకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసిన అంపశయ్యపై ఉన్న టీడీపీని బతికించలేరని స్పష్టం చేశారు. ఎంపీపీ ఎల్లప్ప, సచివాలయాల మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, సర్పంచ్ ఉషారాణి, కో–ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, మాజీ ఎంపీపీ వెంకటస్వామి, సయ్యద్‌బాషా, పుత్రాజు, హనుమంతరెడ్డి, ఇర్ఫాన్, భాస్కర్ పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం : తప్పుడు కథనాలను ప్రచురించడంలో రామోజీరావు దిట్టని జెడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్ రెడ్డి ఆరోపించారు. ఈనాడు దినపత్రిక ప్రతులను శుక్రవారం దహనం చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ పట్టాభిని కొట్టారంటూ పాత ఫొటోలతో తప్పుడు కథనం ప్రచురించి ప్రజలను ,చట్టాలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. తప్పుడు వార్తలు రాయించినందుకు రామోజీరావు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జనార్దన్, కుప్పయ్య, మణి, బాబు, చిన్నబ్బ, బాలకృష్ణ యాదవ్, రామచంద్రయాదవ్, రామకృష్ణ పాల్గొన్నారు.



శ్రీరంగరాజపురంలో ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

పకడ్బందీగా ఎమ్మెల్సీ ఎన్నికలు

చిత్తూరు కలెక్టరేట్ : పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని అబ్జర్వర్లు కాటమనేని భాస్కర్, కోన శశిధర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లపై ఆర్‌ఓ, కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డితో సమావేశం నిర్వహించారు. అబ్జర్వర్లు మాట్లాడుతూ అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్‌ఓ మాట్లాడుతూ పోలింగ్‌కు అవసరమైన బ్యాలెట్ బాక్సులను ఇప్పటికే సిద్ధం చేశామని తెలిపారు. నోడల్ అధికారుల పర్యవేక్షణలతో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా ముందస్తు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. కోడ్ ఆఫ్ కండక్ట్ పరిశీలనకు మండలస్థాయిలో ప్రత్యేక టీమ్‌లను నియమించినట్లు చెప్పారు. ఎస్పీ రిశాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు అవసమైన బందోబస్తు కల్పిస్తున్నామని వెల్లడించారు.

ప్రశాంత వాతావరణంలో..

ప్రశాంత వాతావరణంలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపడుతున్నట్లు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి ఆరు జిల్లాల పరిధిలో 3లక్షల 83 వేల మంది ఓటర్లు ఉంటారని, పోలింగ్ నిర్వహణకు గానూ 320 పోలింగ్ స్టేషన్లు, 133 అదనపు పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు దాదాపు 27 వేల మంది ఓటర్లు ఉన్నారని, 170 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామని వివరించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆరు జిల్లాలలోని కలెక్టర్లు, డీఆర్‌ఓలు, ఆర్డీఓలు ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములైనట్లు వెల్లడించారు. నామినేషన్ల పరిశీలన పూర్తయిందని, 27వ తేదీన తుది జాబితా ప్రకటించనున్నట్లు చెప్పారు. 2వేల మంది సిబ్బంది విధుల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.



జిల్లా అధికారులతో మాట్లాడుతున్న అబ్జర్వర్లు

సమర్థవంతంగా ఎన్నికల విధులు



డీఆర్‌ఓ రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : సెక్టోరియల్ అధికారులు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలని, సమర్థవంతంగా ఎన్నికల విధులు నిర్వర్తించాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, డీఆర్‌ఓ రాజశేఖర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సెక్టోరల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపు, వీల్ చైర్స్, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, వెబ్ క్యాస్టింగ్‌కు ఏర్పాట్లు చేసి నివేదిక సమర్పించాలన్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులకు వేర్వేరుగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రతి రెండు గంటలకు పోలింగ్ శాతం పంపించాలని స్పష్టం చేశారు.

ఎన్నికల హెల్ప్‌డెస్క్ పరిశీలన

ఎమ్మెల్సీ ఎన్నికలకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను డీఆర్‌ఓ రాజశేఖర్ శుక్రవారం పరిశీలించారు.

నూతన గవర్నర్‌తో మంత్రుల భేటీ



రాజ్‌భవన్‌లో శుక్రవారం నూతన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నారాయణస్వామి, ఆర్‌కే రోజా

- అమరావతి

పోలింగ్ బూత్‌ల పరిశీలన

గుడిపాల: మండలంలోని నరహరిపేట జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ బూత్‌ను తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 1,007 మంది పట్టభద్రులు, 33 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

ఒక్కరే మిగిలారు

- అధికారిక ప్రకటనే తరువాయి!

సాక్షి, చిత్తూరు : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక ఏకపక్షంగా మారింది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సిపాయి సుబ్రమణ్యం నామినేషన్ ఒక్కటే మిగలడంతో ఈ స్థానం ఏకగ్రీవం కానుంది. ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం శుక్రవారం కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్లను రిటర్నింగ్ అధికారి, జేసీ వెంకటేశ్వర్ పరిశీలించారు. మధ్యాహ్నం వరకు కొనసాగిన పరిశీలనలో సిపాయి సుబ్రమణ్యం సమర్పించిన పత్రాలు అన్నీ పక్కాగా ఉండడంతో నామినేషన్‌ను ఆమోదించారు. స్వతంత్ర అభ్యర్థి ధనంజయయాదవ్ నామినేషన్‌లో సక్రమంగా వివరాలు లేకపోవడంతో తిరస్కరించారు. దీంతో సిపాయి సుబ్రమణ్యం ఒక్కరే బరిలో మిగిలారు. ఈ క్రమంలో ఈ నెల 27వ తేదీన ఎమ్మెల్సీగా ఎన్నికైన అభ్యర్థిని ప్రకటించనున్నట్లు జేసీ వెల్లడించారు.

వార్ వన్ సైడ్!

ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా స్థానిక సంస్థల్లో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులే అధికంగా ఉన్నారు. దీంతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గెలుపు నల్లేరుపై నడకే అని పలువురు విశ్లేషకులు వెల్లడించారు. ఈ క్రమంలో ఆ పార్టీ అభ్యర్థి సిపాయి సుబ్రమణ్యం నామినేషన్ ఒక్కటే మిగలడంతో వార్ వన్‌సైడ్‌గా మారిందని వివరించారు.

కేడర్‌లో జోష్

వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సునాయాసంగా గెలుస్తుండడం వైఎస్సార్‌సీపీ కేడర్‌లో ఉత్సాహం నింపింది. 2019 నుంచి ఇప్పటి వరకు జరిగిన అన్ని ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ హవా నడిచిన క్రమంలో ఇది రాబోయే సార్వత్రిక ఎన్నికల్లోనూ కార్యకర్తలకు మరింత బూస్టప్ ఇస్తుందని నేతలు భావిస్తున్నారు.



నామినేషన్ల పరిశీలనలో రిటర్నింగ్ అధికారి వెంకటేశ్వర్

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రభావం

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రభావం త్వరలోనే జరగనున్న టీచర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై పడనుంది. సిపాయి సుబ్రమణ్యం ఏకగ్రీవంగా గెలుస్తున్న క్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు మరింత ఉత్సాహంతో పనిచేసే అవకాశముంది. వైఎస్సార్‌సీపీ బలపరిచిన పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డిని గెలిపించుకునేందుకు పార్టీ ప్రజాప్రతినిధులు సైతం సమష్టిగా పనిచేస్తున్నట్లు పలువురు నేతలు వెల్లడిస్తున్నారు.

బీసీలకు స్వర్ణయుగం

జగనన్న పాలనలో బీసీలకు స్వర్ణయుగం వచ్చిందన్నారు. నాపై నమ్మకంతో ఎమ్మెల్సీగా నిలబెట్టిన ముఖ్యమంత్రికి రుణపడి ఉంటా. వెనుకబడిన వర్గాలకు చెందిన అన్ని కులాల వారికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే న్యాయం జరిగింది. – సిపాయి సుబ్రమణ్యం, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి

పట్టభద్రులకు 23..ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానానికి 8 నామినేషన్లు



నామినేషన్ల పరిశీలనతో ఎన్నికల అధికారి హరినారాయణన్

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి ప్రకాశం–నెల్లూరు–చిత్తూరు జిల్లాల పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు దాఖలు చేసిన నామినేషన్లను శుక్రవారం కలెక్టరేట్‌లో క్షుణ్ణంగా పరిశీలించారు. అబ్జర్వర్లు కాటమనేని భాస్కర్, కోన శశిధర్‌లు, అభ్యర్థుల సమక్షంలో ఎన్నికల అధికారి హరినారాయణన్ నామినేషన్ల పరిశీలన చేపట్టారు. ఆమోదం పొందిన, తిరస్కరించిన అభ్యర్థుల జాబితాను మధ్యాహ్నం 3 గంటలకు నోటీస్ బోర్డులో పెట్టారు. ఈ నెల 27వ తేదీన బరిలో మిగిలిన అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపారు. డీఆర్‌ఓ రాజశేఖర్, ఏఓ కులశేఖర్, సూపరింటెండెంట్లు మురళి, వెంకటేశ్వర్, శేషగిరి, డీఎస్పీలు శ్రీనివాసమూర్తి, తిప్పేస్వామి, సీఐలు మద్దయ్య ఆచారి, నరసింహరాజు పాల్గొన్నారు.

ఆమోదం.. తిరస్కరణ

నామినేషన్ల పరిశీలన అనంతరం పట్టభద్రులకు సంబంధించి 30కి గాను 23 నామినేషన్లను ఆమోదించారు.వివిధ కారణాలతో 7 నామినేషన్లు తిరస్కరించారు. ఉపాధ్యాయుల స్థానానికి 8 నామినేషన్‌లకు గాను 8 ఆమోదం పొందాయని అధికారులు ప్రకటించారు.

జిల్లాకు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు

చిత్తూరు కార్పొరేషన్: పుంగనూరు నియోజకవర్గంలో నిర్మిస్తున్న 6 సబ్‌స్టేషన్లలో ఏర్పాటు చేసేందుకు అవసరమైన 5 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు జిల్లాకు చేరిటన్టు ట్రాన్స్‌కో నిర్మాణ విభాగం ఈఈ రమణ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్లను పుంగనూరు పంపించామని, త్వరలోనే ఆయా సబ్‌స్టేషన్లలో అమర్చుతామని వెల్లడించారు.

వేగంగా మరమ్మతులు

జిల్లాలో రోజూ సుమారు 45 ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ట్రాన్స్‌ఫార్మర్ల విభాగం డీఈ శ్రీనివాసమూర్తి తెలిపారు. అవసరాలకు అనుగుణంగా ప్రైవేట్ మరమ్మతు కేంద్రాల సాయం కూడా తీసుకుంటున్నట్లు వెల్లడించారు. చిత్తూరులో మరమ్మతు కేంద్రం నిర్మాణ పనులు పునఃప్రారంభించామని, త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని వివరించారు.

మా బిడ్డను పొట్టనపెట్టుకున్నారు..!

- ఆస్పత్రి వర్గాలతో ఘర్షణకు దిగిన బాధితులు
- మదనపల్లెలో చంటి బిడ్డ మృతి



మదనపల్లె : మా బిడ్డను పొట్టన పెట్టుకున్నారని బాధితులు ఆందోళనకు దిగారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే తమ బిడ్డ మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ప్రైవేట్ ఆస్పత్రి వర్గాలతో శుక్రవారం ఘర్షణకు దిగారు. వివరాలు.. పుంగనూరు మండలం ఈడిగపల్లెకు చెందిన వెంకటేష్ భార్య లోకేశ్వరి 3 నెలల కిందట జిల్లా ఆస్పత్రిలో మొదటి కాన్పులో మగబిడ్డకు జన్మనిచ్చింది. చిన్నారి ఐదు రోజులుగా దగ్గు, జలుబుతో బాధపడుతుండడంతో పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. ఈక్రమంలో శుక్రవారం ఊపిరాడకపోగా పరిస్థితి విషమంగా మారడంతో ఇంజెక్షన్ వేశారు. అయినా ఎలాంటి మార్పు రాకపోవడంతో మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఇక్కడి వైద్యులు చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. దీంతో చంటిబిడ్డ తల్లిదండ్రులు ప్రైవేట్ ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. చికిత్సలో తమ తప్పు లేదని ఆస్పత్రి యాజమాన్యం చెప్పడంతో.. చేసేదిలేక విషణ్ణవదనంతో బిడ్డను తీసుకుని ఇంటికెళ్లిపోయారు.

దోచుకుంది 'పచ్చ' దొంగలే!

- 15 వేల యూనిట్ల మట్టిని స్వాధీనం చేసుకున్న అధికారులు
- సీజ్ చేసిన బట్టీలన్నీ టీడీపీ నేతలవే!



తడుకులో టీడీపీ నేత, సర్పంచ్ వెంకటేష్‌ను ప్రశ్నిస్తున్న ఆర్ఐ స్వరూప

పుత్తూరు రూరల్ : నగరి నియోజకవర్గంలో టీడీపీ నాయకుల అవినీతి ఒక్కొక్కటి సాక్ష్యాధారాలతో ప్రజల ముందుకు వస్తున్నాయి. నిన్న నగరిలో భూముల కబ్జా పర్వం బయటకు రాగా, నేడు పుత్తూరులో మట్టి అక్రమ తవ్వకాలు వ్యవహారం వెలుగులోకి వచ్చింది. శుక్రవారం మండల పరిధిలోని రెవెన్యూ గ్రామాల్లో పలు ఇటుక బట్టీలను అధికారులు తనిఖీ చేశారు. 9 బట్టీల్లో అక్రమంగా నిల్వ చేసిన 15 వేల యూనిట్ల మట్టిని గుర్తించారు. ఈ బట్టీలన్నీ టీడీపీ నేతల కనుసన్నల్లో నిర్వహించేవే కావడం గమనార్హం. గొల్లపల్లె గ్రామంలోని వెంగమనాయుడు బట్టీ వద్ద 6 వేల యూనిట్ల మట్టి సీజ్ చేశారు. తడుకులో టీడీపీ నేత, సర్పంచ్ వెంకటేష్ అలియాస్ బొబ్బిలికి చెందిన 3 వేల యూనిట్ల మట్టిని స్వాధీనం చేసుకున్నారు. వెంకటేశులునాయుడుకు చెందిన 1000 యూనిట్లు, ప్రసాద్‌నాయుడు వద్ద 500, రమేష్ వద్ద 1000, రవి వద్ద 1000, దొరస్వామి వద్ద 1000, ధర్మయ్య వద్ద 800, గోపీకి చెందిన 700 యూనిట్ల మట్టిని అధికారుల సీజ్ చేశారు. మార్కెట్‌లో ఈ మట్టి మొత్తం విలువ రూ.1.5 కోట్లు ఉంటుందని వెల్లడించారు. దాడుల్లో ఆర్ఐ స్వరూప, వీఆర్‌ఓలు రవికుమార్, సాయిప్రసాద్, జయసింహ పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడుతూ.. అడ్డంగా దొరికిపోతూ

టీడీపీ నాయకులు యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నారు. తర్వాత అడ్డంగా అధికారులకు సాక్ష్యాలతో పాటు దొరికిపోతున్నారు. అయినా టీడీపీ నేతలు మాత్రం మంత్రి రోజా భూములు ఆక్రమించారని, మట్టిని తరలిస్తున్నారంటూ ఆరోపణలు చేస్తున్నారు. ఏ ఒక్కటీ నిరూపించలేక తమ అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు మంత్రి రోజా ఇంటిపైకి మహిళలను ఉసిగొల్పి దాడులకు తెగబడ్డారు. తమ పార్టీవారే అక్రమాలకు పాల్పడుతూ అడ్డంగా దొరికిపోతుండడంతో టీడీపీ నేతల పరిస్థితి కుడితిలో పడిన ఎలుకలా తయారైంది. గత ఏడాది జనవరి 10వ తేదీన పుత్తూరు పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు బీఎస్ హరికృష్ణ గంజాయి స్మగ్లింగ్ చేస్తూ విజయనగరం జిల్లా శృంగవరపుకోట వద్ద పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడితో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ సెల్ఫీ దిగిన ఫొటోలు సైతం అప్పట్లో వైరల్ అయ్యాయి. నిన్నటి నిన్న నగరిలో టీడీపీ నాయకుల భూముల ఆక్రమణలపై బాధితులు మీడియా ముందుకు వచ్చారు. నేడు పుత్తూరులో మట్టి దందా బయట పడింది.

ప్రభుత్వ పనులకు వినియోగిస్తాం:



ఇటుక బట్టీలో అక్రమంగా డంప్ చేసిన సుమారు 15వేల యూనిట్ల మట్టి సీజ్ చేశాం. ఈ మట్టి, ఇటుకలను ప్రభుత్వం చేపట్టిన నిర్మాణ పనులకు వినియోగిస్తాం. మండలంలో ఇంకా కొన్ని బట్టీలు ఉన్నాయి అన్నిట్లో తనిఖీలు నిర్వహిస్తాం. అక్రమంగా మట్టి, గ్రావెల్ తరలిస్తే కఠిన చర్యలు తప్పవు.

– రోశయ్య, తహసీల్దార్, పుత్తూరు

జన్మదినం.. వైభవోత్సవం!

- ఘనంగా తిరుపతి జన్మదిన వేడుకలు
- గోవిందనామస్మరణతో పులకించిన పురవీధులు
- పసుపునీళ్లు పోసి, గుమ్మడికాయలతో దిష్టితీసిన స్థానికులు
- ఇది జన్మజన్మల అనుబంధమని కొనియాడిన నేతలు
- సమతామూర్తి ఫ్లెక్సీలు చేతబట్టి భారీ ప్రదర్శనలు



సారెను ఊరేగింపుగా తీసుకెళ్తున్న ఎమ్మెల్యే, మేయర్

తిరుపతి కల్చరల్: తిరుపతి 893 జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. టీటీడీ, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో సమతా దీక్షులైన ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో తిరుపతి జన్మదిన వేడుకలు వైభవంగా నిర్వహించారు. మేయర్ డాక్టర్ శిరీష, డెప్యూటీ మేయర్లు ముద్రనారాయణ, భూమన అభినయ్ రెడ్డి నగర ప్రముఖులతో కలిసి తొలుత శ్రీగోవిందరాజ స్వామి ఆలయం వద్దనున్న శ్రీఆంజనేయస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి పట్టు వస్త్రాలను శ్రీగోవిందరాజస్వామి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామివారికి సమర్పించారు. అనంతరం పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి ఆశీస్సులు అందుకున్నారు. ఆలయ భాష్యకారులకు వస్త్రాలు బహూకరించారు. వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, భజన కళాబృందాల సాంస్కృతిక ప్రదర్శనల నడుమ ఆధ్యాత్మిక శోభాయాత్ర ఆరంభించారు. భక్తులు శ్రీరామానుజాచార్యులు చిత్రపటాలు, మా తిరుపతి పుట్టిన రోజు పండుగ ఫ్లెక్సీలు చేతబట్టి గోవిందనామస్మరణ చేస్తూ ముందుకు కదిలారు. ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో కళాకారుల చెక్క భజనలు, కోలాట ప్రదర్శనలు, రంగస్థలి ఆధ్వర్యంలో కళాకారుల పౌరాణిక వేషధారణలు ఆకట్టుకున్నాయి. అడుగడుగునా పసుపునీళ్లు పోస్తూ, గుమ్మడి కాయలతో దిష్టిదీసి నీరాజనాలు పట్టారు.

తిరుపతి పుట్టిన రోజు పండుగ కొనసాగిస్తాం

శోభాయాత్రలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ సమతామూర్తి శ్రీరామానుజాచార్యులు 1130 ఫిబ్రవరి 24న శంకుస్థాపన చేసిన పవిత్రమైన పుణ్యక్షేత్రం తిరుపతి అని, ఇంతటి చారిత్రకత నేపథ్యం కలిగిన తిరుపతి పుట్టిన రోజు వేడుకలను రాబోవు తరాలకు మార్గదర్శకత చేస్తూ ప్రతి ఏటా మరింత వైభవోపేతంగా నిర్వహిస్తామని తెలిపారు. ప్రపంచంలో వ్యక్తులకు మాత్రమే జన్మదిన వేడుకలు జరుగుతాయని, అయితే ఒక ప్రాంతానికి జన్మదిన వేడుకలు జరగడమంటే ఒక్క తిరుపతికి మాత్రమేనన్నారు. తిరుమలలోని అర్చకుల నివాసం తిరుపతిలో ఉండాలనే ఆశయంతో శ్రీగోవిందరాజస్వామి ఆలయాన్ని స్థాపించడంతో పాటు గోవిందరాజపురం ఏర్పాటు చేశారని తెలిపారు. నాటి గోవిందరాజపురం, తర్వాత రామానుజాపురంగా.. ఆ తర్వాత 13వ శతాబ్దం నుంచి తిరుపతిగా పిలుస్తున్నారని చెప్పారు. ఇక్కడ అణువణువూ పవిత్రమన్నారు. తిరుపతి నగర పుట్టిన రోజు మహోన్నత కార్యక్రమాన్ని తాను నిర్వహించడం ఆ భగవంతుని అనుగ్రహమేనన్నారు. కార్యక్రమంలో తిరుపతి నగర ప్రముఖులు, మేధావులు, కవులు, రచయితలు, కళాకారులు, వివిధ ప్రజాసంఘాలు, సంస్థల ప్రతినిధులు, నగరంలోని 50 డివిజన్ల కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, వివిధ ఆలయాల చైర్మన్లు, డైరెక్టర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాదకద్రవ్య రహిత నగరమే లక్ష్యం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధికారులు

తిరుపతి క్రైం: మాదకద్రవ్య రహిత తిరుపతి నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు యాంటీ డ్రగ్స్‌పై శుక్రవారం జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి బాలాజీ కాలనీ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు ప్లకార్డులు చేతబూని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు నెలలుగా ప్రత్యేకంగా యువతను డ్రగ్స్ మహమ్మారి బారినపడకుండా చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 90 విద్యా సంస్థలలో అవగాహన కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. అదనపు ఎస్పీ వెంకటరావు, సెబ్ జాయింట్ డైరెక్టర్ రాజేంద్ర, సబ్ సూపరింటెండెంట్ స్వాతి, డీఎస్పీలు కాటమరాజు, నరసప్ప, సీఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దమల్లెల అడవికి నిప్పు



రొంపిచెర్ల: మండలంలోని పెద్దమల్లెల అడవికి గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో భారీ విస్తీర్ణంలో అడవి కాలి పోయింది. అడవి పక్కనే ఉన్న 150 మామిడి చెట్లు కాలి పోయినట్లు బాధిత రైతులు తెలిపారు. అడవి నుంచి మంటలు పక్కన పంటలకు వ్యాపించకుండా రైతులు రాత్రింతా కాపాలా కాయాల్సి వచ్చింది. వీఎస్ఎస్‌ల ద్వారా అటవీ సమీప గ్రామాల ప్రజలకు అడవుల సంరక్షణపై అవగాహన కల్పిస్తున్నా కొందరు గొర్రెల కాపరులు అడవికి నిప్పు పెడుతున్నారని ఎఫ్‌బీవో కృష్ణమూర్తి తెలిపారు. మామిడి చెట్లు కాలినట్లు తమకు రైతులు ఎవరు ఫిర్యాదు చేయలేదని పేర్కొన్నారు. అటవీ సంరక్షణ అందరి బాధ్యతని తెలిపారు.

ఆటో చోరీ కేసులో నలుగురు అరెస్ట్

సోమల: మండలంలోని ఇరికిపెంట పంచాయతీ పార్వతీనగర్‌లో గత ఏడాది ఆగస్టులో జరిగిన ఆటో చోరీ కేసులో నలుగురు నిందితులు అరెస్టు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్ఐ మారుతి తెలిపారు. ఆయన కథనం మేరకు.. పార్వతీనగర్‌లో రమేష్ ఇంటి వద్ద ఆటో పార్కు చేసి ఉండగా చోరీకి గురైంది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం అందిన కచ్చితమైన సమాచారం మేరకు ఇరికిపెంట బస్టాప్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురిని ఎస్ఐ సిబ్బందితో కలసి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు అనంతపురం చెందిన అరుణ్ కుమార్, చౌడేపల్లెకు చెందిన లోకేష్, చంద్రశేఖర్, హరిష్‌గా తేలింది. ఆటోను చోరీ చేసింది తామేనని అంగీకరించారు. ఆటో ఎర్రచందనం కేసులో పట్టుబడి ఎర్రావారిపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఉన్నట్లు తెలిపారు. నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం పుంగనూరు కోర్టులో హాజరుపరుచనున్నట్లు పేర్కొన్నారు.

ఉపాధ్యాయుడిపై అట్రాసిటీ కేసు

చిత్తూరు అర్బన్: నగరంలోని గిరింపేట మున్సిపల్ పాఠశాల ఉపాధ్యాయుడు ఏకాంబరరెడ్డిపై పోలీసులు శుక్రవారం అట్రాసిటీ కేసు నమోదు చేశారు. వన్‌టౌన్ సీఐ నరసింహారాజు కథనం మేరకు.. ఏకాంబరరెడ్డి తోటి ఉపాధ్యాయుల సర్వీసు రిజిస్టర్లు (ఎస్సార్) తీసుకుని వేతనాల బిల్లులు సిద్ధం చేస్తుంటాడు. ఆ పని నిమిత్తం ఈనెల 6వ తేదీ చిత్తూరు సంతపేట పీఎన్‌సీ మున్సిపల్ ఉన్నత పాఠశాలకు వెళ్లాడు. అక్కడ ప్రధానోపాధ్యాయులు ముందు కూర్చుని మాట్లాడుతున్న తనను కులం పేరుతో అవమానించాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఏకాంబరరెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు



కుమారస్వామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న టీడీపీ నాయకులు

పుత్తూరు రూరల్: మండలంలోని తడుకు పంచాయతీ చంద్రప్పనాయుడు కండ్రిగకు చెందిన పలువురు టీడీపీ నాయకులు శుక్రవారం పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరుడు వై.కుమారస్వామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. తిరుపతిలోని ఆయన నివాసంలో టీడీపీ నేతలు కె.నారాయణ, పి.రాజేంద్ర, కె.విజయ్‌కుమార్, పి.ప్రవీణ్‌రాజు, దాసురాజు, వి.మురళి, జీఎస్ మణి, కె.శేఖర్, ఆర్.గోపాల్, ఏ.మునెయ్యలతో పాటు 20 కుటుంబాలవారు పార్టీలో చేరారు. వీరికి కుమారస్వామిరెడ్డి పార్టీ కండువా కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ మంత్రి రోజా నేతృత్వంలో సాగుతున్న అభివృద్ధితో పాటు రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చేపట్టిన సేవా కార్యక్రమాలకు ఆకర్షితులైనట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఏ.హరి పాల్గొన్నారు.

రెండు బస్సుల ఢీ

చిత్తూరు అర్బన్: నగరంలోని గిరింపేటలో శుక్రవారం ఓ ప్రైవేటు బస్సు మరో బస్సును ఢీ కొట్టింది. దీంతో వాహన డ్రైవర్లు, కండక్టర్లు కాసేపు వాగ్వాదానికి దిగారు. ఈక్రమంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రయాణికులు కల్పించుకుని సర్దిచెప్పడంతో రెండు బస్సులు ముందుకు కదిలాయి. ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు.

కర్ణాటక మద్యంతో వస్తున్న కారు బోల్తా

పలమనేరు : గంగవరం మండలం పొన్నమాకులపల్లె వద్ద కర్ణాటక మద్యంతో వస్తున్న ఓ కారు శుక్రవారం అదుపు తప్పి బోల్తా పడింది. వివరాలు.. పూతలపట్టు, చిత్తూరు ప్రాంతాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు ఏపీ 16 బీకే 2246 నంబరు గల కారులో కర్ణాటక మద్యం తీసుకుని వస్తుండగా డివైడర్‌ను ఢీకొంది. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు వచ్చేలోపు కారులోని ఇద్దరు పరారవగా, తీవ్రంగా గాయపడిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో ప్రమాద ఘటనను చూసేందుకు వచ్చిన స్థానికులు కారులోని టెట్రా ప్యాకెట్లను గమనించి తీసుకెళ్లారు. దీనిపై సెబ్ సీఐ ఎల్లయ్యను వివరణ కోరగా జరిగిన సంఘటన వాస్తవమేనన్నారు. గంగవరం పోలీసులు విచారిస్తున్నారని తెలిపారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

- రూ.4.50లక్షల సొత్తు అపహరణ





దొంగలు పగలగొట్టిన బీరువా, చిందరవందరగా పడేసిన దుస్తులు, వస్తువులు



దొంగలు లోపలకు ప్రవేశించడానికి తొలగించిన కిటికీ

నగరి : పట్టణంలోని ఓ ఇంట్లో శుక్రవారం పట్టపగలే గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వివరాలు.. స్థానిక గోల్డెన్‌సిటీకి చెందిన ప్రకాష్ అనే వ్యక్తి బస్టాండ్ ప్రాంగణంలో పాల దుకాణం నడుపుతున్నాడు. దీంతో ఎక్కువ సమయం కుటుంబసభ్యులు షాప్‌లోనే ఉంటుంటారు. ఇది గమనించిన దుండగులు ఇంట్లో చొరబడ్డారు. బీరువాను పగలగొట్టి నగలు, నగదు అపహరించారు. అనంతరం ఇంట్లోని ఆహారపదార్థాలను ఆరగించి మరీ దర్జాగా వెళ్లిపోయారు. దుకాణం నుంచి వచ్చిన ప్రకాష్ కుటుంబసభ్యులు ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. ఇంటి వద్ద భద్రత కోసం రెండు సీసీ కెమెరాలు అమర్చామని, కుక్కను కూడా పెంచుతున్నామని బాధితులు తెలిపారు. అయితే దుండగులు ఇంటి వెనుకవైపు గోడ దూకి, కుక్కపై మత్తుమందు చల్లి, కిటికీ ద్వారా లోపలికి ప్రవేశించినట్లు గుర్తించామన్నారు. మూడు రోజుల క్రితమే బ్యాంకు లాకర్ నుంచి తీసుకువచ్చిన 10 సవర్ల బంగారు నగలు, రూ.30వేల నగదు చోరీకి గురైందని వెల్లడించారు. దాదాపు రూ.4.50లక్షల సొత్తును అపహరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు ఆరాతీసి వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విజయ డయాగ్నొస్టిక్ సెంటర్ ప్రారంభం



మాట్లాడుతున్న విజయ డయాగ్నొస్టిక్ సెంటర్ చైర్మన్ డాక్టర్ సురేంద్రనాథ్‌రెడ్డి

తిరుపతి కల్చరల్: రెడ్డి రెడ్డి కాలనీలో ఏర్పాటు చేసిన విజయ డయాగ్నొస్టిక్ సెంటర్‌ను శుక్రవారం ఆ సంస్థ చైర్మన్ డాక్టర్ సురేంద్రనాథ్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తమ విజయ డయాగ్నొస్టిక్ సెంటర్లు దేశ వ్యాప్తంగా ఉన్నాయని తెలిపారు. 125వ సెంటర్‌ను తిరుపతిలో ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ఇక్కడ బోర్ 3టీ ఎంఆర్ఐ, మల్టీ డైమెన్షనల్ సిటీ, గామా కెమెరా, పూర్తి ఆటోమేటెడ్ ల్యాబ్, డిజిటల్ మామోగ్రఫీ వంటి అత్యాధునిక పరికాలు ఉన్నాయని తెలిపారు. ప్రాథమిక రక్త పరీక్ష నుంచి పూర్తి స్థాయి రోగ నిర్ధారణ పరిశోధనలు, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు కూడా చేస్తామని పేర్కొన్నారు. సెంటర్ ప్రారంభం సందర్భంగా ఈనెల 28వ తేదీ వరకు ఉచితంగా షుగర్, థైరాయిడ్ పరీక్షలు చేస్తామన్నారు.